క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 43, వంకాయ 35, బెండ 23, పచ్చిమిర్చి 50, కాకర 45, బీర 23, క్యాబేజీ 20, ఫ్రెంచిబీన్స్ 35–55, క్యారెట్ 40, దొండ 28–35, చిక్కుడు 35–55, గోకర 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 55, ఆలు 21, దోస 23, సొర 15, పొట్ల 28, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 38. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆర్టీసీ పంద్రాగస్టు ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోండి

చైతన్యపురి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీ ఇస్తోందని దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లెవెలుగు బస్ సర్వీసుల్లో ప్రయాణించే 60 ఏళ్లు పైబడిన వారికి టికెట్‌లో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో 24 గంటల పాటు అపరిమిత ప్రయాణానికి సంబంధించిన టీ–24 టికెట్ పెద్దలకు కేవలం రూ.75లకు, పిల్లలకు రూ. 50 కే అందజేస్తారన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు మాత్రమే ఈ రాయితీలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం అన్నారు.

ఘనంగా శ్రీరామకోటి గీతాజ్ఞాన యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

చంపాపేట: దుర్గానగర్ కాలనీలోని ఆంజనేయ ఆలయంలో సోమవారం కాలనీ సంక్షేమ సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస రెడ్డి, హేమ దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామ కోటి గీతాజ్ఞాన యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సతీమణి కమలా సుధీర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. నాయకులు కరుణాకర్‌రెడ్డి, సురేఖ, అంజిరెడ్డి, గోకు శేఖర్‌రెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, చీర శ్రీనివాస్, గోపాల్ ముదిరాజ్, అనసూయ, రమాదేవి పాల్గొన్నారు.

గిరిజనుల ఐక్యతకు ప్రతీక తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: తీజ్ వేడుకలు గిరిజనుల ఐక్యతను చాటుతాయని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజనలు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. మహిళలు మొక్కల బుట్టలను నెత్తిన పెట్టుకొని సరూర్‌నగర్ చెరువు వరకు ఊరేగింపుగా సాగారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో బాక్స్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, బృందావన్ కాలనీ జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, బృందావన్ కాలనీల మీదుగా మూసీలో కలుపుతూ చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బాక్స్ డ్రైనేజీ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సరూర్‌నగర్ నుంచి కలుపుతూ చేపట్టిన బాక్స్ డ్రెయిన్ లైన్‌ను కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్లాన్ ప్రకారం నిర్మించాలని ఏఈ మాత్య నాయక్‌తో అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సుందర్ నారాయణ, రామకృష్ణ కొత్త తిరుమల్ పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

- అంతటా మువ్వన్నెల విద్యుత్ కాంతులు, జాతీయ జెండాల రెపరెపలు
- పలు ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



76 అడుగుల జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్/మలక్‌పేట/ సైదాబాద్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. జాతీయ జెండాలు, మువ్వన్నెల విద్యుత్ కాంతులతో అన్ని ప్రాంతాలు మెరిసిపోతున్నాయి.

- మలక్‌పేటజోన్ పరిధిలోని కాలనీలు, ప్రధాన రహదారులు, ఇళ్లు, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో మూడు రంగుల జెండాలను ఏర్పాటు అందంగా తీర్చిదిద్దారు.
- ఉదయం నుంచి అన్ని ప్రాంతాలలో వివిధ పార్టీలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వజ్రోత్సవ ర్యాలీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- ఆర్‌కేపురం, సరూర్‌నగర్,దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, సైదాబాద్ తదితర ప్రాంతాలలోని విద్యాసంస్థలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాల పాటల పోటీలు, వివిధ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు.
- పంద్రాగస్టు సందర్భంగా కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ఉచితంగా జాతీయ జెండాలను పంచారు. బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ర్యాలీలు నిర్వహించారు. తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. కాలనీల్లోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు రెపరెపలాడుతున్నాయి.
- స్వతంత్య్ర దినోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుతో పాటు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

76 అడుగుల జెండాతో ర్యాలీ..

బీజేపీ యువమోర్చా నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్ సిల్వర్‌డ్రాప్స్ స్కూల్ నుంచి నిర్వహించిన తిరంగా ర్యాలీని సుభాష్‌చందర్జీ ప్రారంభించారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 76 అడుగుల జాతీయ జెండాతో వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సైదాబాద్‌లోని ప్రధాన, అంతర్గత రహదారులపై విద్యార్థుల నినాదాలతో సాగిన ర్యాలీ దేశభక్తిని చాటింది. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగాల హరిగౌడ్, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీని ప్రారంభించిన సుభాష్‌చందర్జీ



కల్యాణ్‌నగర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో లింగాల హరిగౌడ్



చిత్రలేవుట్ కాలనీలో జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న కాలనీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్



తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేసిన కార్పొరేటర్ల భాగ్యలక్ష్మి, శ్వేతామధుకర్‌రెడ్డి

స్వాతంత్య్ర పోరాట అమరవీరులను స్మరించుకోవాలి



లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: దేశ స్వాతంత్య్ర కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులను ప్రతి ఒక్కరినీ స్మరించుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఎల్‌బీనగర్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, సెక్యూలర్ ముసుగులో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం దేశాన్ని ముక్కలు చేసిందని ఆరోపించారు. స్వతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జెండాను ఎగరవేయాలని కోరారు. బీజేపీ నాయకులు విజయ్ భాస్కర్, కొత్త రవీందర్‌గౌడ్, క్లెం రవిందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాకేష్‌యాదవ్, కృష్ణం రాజు, శ్రీనివాస్ జగదీశ్, హరిప్రసాద్, నాగరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో భారత్ అగ్రరాజ్యంగా ఎదగాలి



సంస్థ ప్రతినిధులతో కలిసి కవులను సత్కరించిన వైఎస్‌ఆర్ మూర్తి

సైదాబాద్: పాలకులు, విద్యావేత్తలు, వ్యాపార దిగ్గజాలు, రైతులు.. ఇలా అన్ని రంగాల వారి సమష్టి కృషితో మన దేశం అగ్రరాజ్యంగా ఎదగాలని వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి ఆకాంక్షించారు. సోమవారం వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా 'పరవశించిన నా జన్మభూమి' అనే అంశంపై పలువురు కళాకారులు కవితలు, గేయాలు ఆలపించారు. అనంతరం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన కవులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్వసాహితీ అధ్యక్షుడు డాక్టర్ బి.జయరాములు, డాక్టర్ లక్ష్మణరావు, శైలజమిత్ర, ఆచార్య అయ్యల సోమయాజులు, గొర్తి లక్ష్మి, రఘురామమూర్తి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చాటిన రాష్ట్ర క్రీడాకారులు



గెలుపొందిన క్రీడాకారులతో కోచ్‌లు ఎంవీ ఫణికిషోర్, శ్రీధర్

మలక్‌పేట: కోయంబత్తూర్‌లో ఈనెల 11 నుంచి 14 తేదీ వరకు జరిగిన సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ –2023లో తెలంగాణకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారని రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టీమ్ మేనేజర్ కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మూసారంబాగ్‌లోని తన నివాసంలో టోర్నీ విజేతల వివరాలు తెలియజేశారు. ఉమెన్ సింగిల్స్ వి. శ్రేయాన్సీ, బాయ్స్ సింగిల్స్ ప్రణవ్‌రామ్ విజయం సాధించారన్నారు. మిక్సిడ్ డబుల్స్‌లో సాత్విక్‌రెడ్డి అండ్ కె. వైష్ణవి, మెన్ సింగిల్స్‌లో పి.సాహస్‌కుమార్, గరల్స్ సింగిల్స్‌లో ప్రశంస బోనం రన్నర్స్‌గా నిలిచారన్నారు. బాయ్స్ సింగిల్స్‌లో టి. హర్షిత్, గరల్స్ సింగిల్స్‌లో రుషితా పాండే, గర్ల్ డబుల్ ఎ.శిఖా అండ్ నయనికరెడ్డి, మెన్ డబుల్స్ ఏపీ శశాంక్ అండ్ సుధీష్ వెంకట్‌లు మూడోస్థానం నిలిచారని తెలిపారు. క్రీడాకారులకు, కోచ్‌లు ఎంవీ ఫణికిషోర్, శ్రీధర్‌లకు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

తొలగించారు... కొత్తది ఏర్పాటు మరిచారు!

మార్కెట్‌లో హైమాస్ట్ లైట్ లేక ఇక్కట్లు

చంచల్‌గూడ: వారం రోజుల క్రితం కుర్మగూడ డివిజన్‌లోని మాదన్నపేట మార్కెట్‌లో హైమాస్ట్ లైట్ స్తంభం అడుగు భాగం తుప్పుపట్టి షాపుపై పడింది. పోలీసుల సమాచారంతో సంబంధిత అధికారులు స్తంభాన్ని తొలగించారు. అయితే, వారం రోజులు గడుస్తున్నా.. తొలగించిన స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు రాత్రి సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు విద్యుత్, జీహెచ్‌ఎంసీ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించిన కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: 18 ఏళ్ల వయసు నిండిన యువత అందరూ తమ పేర్లను ఓటరుగా నమోదు చేయించుకోవాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వాణినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు ద్వారా మనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకొని సుపరిపాలన సాధించుకోవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీ, ఎన్నికల కమిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చంపాపేటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: వంగ



బంగారు ఎన్‌క్లేవ్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్‌లోని పలు కాలనీల్లో ఉన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మారుతీనగర్, బంగారు ఎన్‌క్లేవ్ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి వరదనీటి కాలువ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మారుతీనగర్, రాజిరెడ్డి నగర్, ఎంఎల్‌ఆర్ కాలనీల్లో ప్రారంభించిన వరదనీటి కాలువ పనులు చివరి దశలో ఉన్నాయని, కాలువల ఏర్పాటుతో కాలనీల్లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సర్కిల్ ఏఈ సురేష్, వాటర్ వర్క్స్ డీజీఎం నాగరాజు, మేనేజర్ రమ్యభారతి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నర్సింహాచారి, సుధాకర్, రఘునందన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరు ధాన్యాల ఆహారంతో జీవనశైలిలో మార్పు



హయత్‌నగర్‌లో చిరుధాన్యాల అల్పాహారంపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేత మురళీధర్‌రావు

మన్సూరాబాద్: చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకుంటే జీవనశైలిలో మార్పు వస్తుందని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. నయా మిల్లెట్స్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి వద్ద సోమవారం మిల్లెట్స్‌తో తయారుచేసిన అల్పాహారాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమానికి మురళీధర్‌రావుతో పాటు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మిల్లెట్స్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, కొండల్‌రెడ్డి, మాధవి, కవితారెడ్డి, నయా మిల్లెట్స్ ప్రతినిధులు అమర్, రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విశ్వకర్మ క్రికెట్ లీగ్ విజేత దిల్‌సుఖ్‌నగర్ జట్టు



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం నిర్వహిస్తున్న విశ్వకర్మ క్రికెట్ లీగ్‌లో భాగంగా ఫైనల్ మ్యాచ్ సోమవారం ఉదయం అల్మాస్‌గూడ ఏవైఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగింది. ఈనెల 9 నుంచి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయని, ఫైనల్స్‌లో చార్మినార్, దిల్‌సుఖ్‌నగర్ టీంలు తలబడగా, ఒక్క పరుగు తేడాతో దిల్‌సుఖ్‌నగర్ టీం గెలుపొందిందని సంఘం ప్రధాన కార్యదర్శి తుడిమళ్ల లవకుమార్ తెలిపారు. అనంతరం విజేత టీంకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవిచారి, ఉపాధ్యక్షుడు శ్రీరామదాసు వెంకటాచారి, రాష్ట్ర నాయకులు ఎర్రోజు వేణుగోపాల్, రవిచారి, సలహాదారుల శ్రీరామదాసు శ్రీనివాసచారి, రాళ్ల శివ, గోపాల్ పాల్గొన్నారు.

స్నేహితులు చంపేశారు!

- వీడిన యువకుడి అదృశ్యం కేసు మిస్టరీ
- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం
- శవాన్ని కాల్చి బూడిద చేసిన నిందితులు
- ఐదుగురి అరెస్టు, పరారీలో ప్రధాన నిందితుడు



ఇమ్రాన్ (ఫైల్)

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 5న తప్పిపోయిన ఇమ్రాన్‌ను స్నేహితులే హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోహత్య చేసి, ఆ తర్వాత ఆనవాళ్లు కనిపించకుండా మృతదేహాన్ని కాల్చి బూడిద చేసినట్టు నిందితుల విచారణ తేలింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం...సరూర్‌నగర్ చౌడి సమీపంలో నివసించే ఇమ్రాన్ (25) బ్యాగ్‌ల వ్యాపారం చేస్తూ చిన్నిచిన్న నేరాలు చేస్తుండేవాడు. ఈనెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇమ్రాన్ తిరిగి రాకపోవటంతో తల్లి ముంతాజ్‌బేగం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇమ్రాన్‌తో సన్నిహితంగా ఉండే ఆరుగురు స్నేహితులపై పోలీసులకు అనుమానం వచ్చింది. తమను ఎలాగైనా పోలీసులు పట్టుకుంటారని పసిగట్టిన ఇమ్రాన్ స్నేహితులు డప్పుల సతీష్, సంపంగి శేఖర్ అలియాస్ కమలేష్, బొర్రార అరుణ్‌కుమార్, రాగుల శ్యాంసుందర్ అలియాస్ బొట్టు శ్యామ్ సోమవారం మధ్యాహ్నం సరూర్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ అవినాష్ దగ్గర లొంగిపోయారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, హత్య చేసిన తీరు వెల్లడించారు. ఈనెల 6న ఉదయం చైతన్యపురి సత్యానగర్ సమీపంలోని మూసీ నది పక్కన ఇమ్రాన్‌తో పాటు మిగిలిన ఆరుగురు స్నేహితులు మద్యం తాగారు. అదే సమయంలో డబ్బు లావాదేవీల్లో కొంత గొడవ జరిగింది. నా బైక్ తీసుకెళ్లి పాడు చేశావు, రిపేర్ చేసి ఇవ్వాలని లక్ష్మణ్‌సింగ్ అనే స్నేహితుడితో ఇమ్రాన్ గొడవపడ్డాడు. మద్యం మత్తులో ఉన్న లక్ష్మణ్ సింగ్ తన వద్ద ఉన్న కత్తితో ఇమ్రాన్ మెడపై దాడి చేశాడు. అనంతరం అందరూ కలిసి అతడిని కత్తితో పలుమార్లు పొడిచి చంపేశారు. అనంతరం సమీపంలోనే శవాన్ని పెట్రోల్ పోసి కాల్చేశామని పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. దీంతో పోలీసులు నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి మృతుడికి సంబంధించి బూడదైన ఎముకలు, రక్తపు మరకలను క్లూస్‌టీం ద్వారా సేకరించారు. హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని ఐదుగురినీ సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రధాన నిందితుడు లక్ష్మణ్‌సింగ్ పరారీలో ఉన్నాడన్నారు. కాగా, నిందితుల్లో కొందరు పాత నేరస్తులని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రాధాన్యం



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఉద్యమకారుల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్‌గా నాల్యకొండ శ్రీనివాస్‌రెడ్డి, కో కన్వీనర్‌గా కె. నర్సింహ ముదిరాజు, కార్యవర్గ సభ్యులుగా మారోజు రామచారి, కొండ్ర శ్రీనివాస్, పుట్టం విజేందర్, పోలే సుధామ, దయానంద్ ముదిరాజ్, వెంకటచారి, హనుమంతరావు, ఈశ్వర్‌గౌడ్, యాదగిరి ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, శివశంకర్, యాదయ్య, ఇలియాజ్, సయ్యద్ ఫైరోజ్ అహ్మెత్, లావణ్య, రాజ్‌కుమార్లను ఎన్నుకున్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి బస్తీబాట: బ్రహ్మయ్య



బస్తీబాటలో రజకుల సమస్యలు తెలుసుకుంటున్న పెద్దవూరే బ్రహ్మయ్య

నాగోలు: కులవృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వం అందించే లక్ష రూపాయలను అర్హులైన రజకులకు మంజూరు చేయించాలని తెలంగాణ గాద్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య అన్నారు. రజకుల సమస్యలను తెలుసుకొనేందుకు ఆయన నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీ, లలితానగర్, ఆదర్శనగర్, కో– ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, గణేష్‌నగర్, అరుణోదయనగర్, బండ్లగూడ, చాణక్యపురి కాలనీల్లో సోమవారం బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ, పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొగించాలని కోరారు. ధోబీఘాట్లకు ప్రభుత్వం అందిస్తున్న 250 యూనిట్లు ఉచిత కరెంటు కొందరికి అందడం లేదని, ఉన్నతాధికారులు ఈ పథకం రజకులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తీబాటలో తెలుసుకున్న రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసుకుంటామని బ్రహ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వడ్లాల మడేల్, కార్యనిర్వాహక కార్యదర్శి పున్నం రాములు, గ్రేటర్ అధ్యక్షుడు పగడాల లక్ష్మణ్, ఎల్‌బీనగర్ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.